# శుక్రవారం

## శ్రీమతి భోగరాజు చిట్టెమ్మగారు.

● ● ●

సాయంకాలం 6 గంటలయింది. సూర్యభగవానుడు కూడా యింటికి వెళ్లేటందుకు తొందర పడుతున్నాడు. పక్షులు గుంపులు గుంపులుగా గూళ్లవైపుకు ఎగిరి పోతున్నాయి. ఆతొందరలోనే కనిపిస్తోంది ప్రొద్దుటినుంచి విడిచిపెట్టియున్న పిల్లల్ని కలుసుకోవాలని అవి పడే ఆతృత. కూలినాలి జనం కూడా పని పూర్తిచేసుకుని కూనిరాగాలు తీసుకుంటూ తమతమ గుడిసెలలోకి పోతున్నారు. పాపం నారాయుడు ఇంకా పనిచేస్తూనేయున్నాడు.

బాబయ్యా, ఈరోజున కూలిప్పించండి, నాల్గురోజులయిందండి మాయింటిదిలేచి. కూలిప్పిస్తే మందేయిస్తానండి.

రేపిస్తాలేరా, ఎందుకలా తొందరపడతావు?

అయ్యగారూ, కాస్త కనికరించండి, మీకాళ్లకి మొక్కుతా.

సరే, అలాగే యిస్తాలే, ఒరే రాముడూ రెండురూపాయలు తెచ్చివీడికివ్వరా, పాపం గోలపెడుతున్నాడు.

రాముడూ, ఇనప్పెట్టె తీస్తున్నావెందుకురా-అంది వెంకమ్మ.

ఏమీలేదే అమ్మా, నారాయుడుకి కూలివ్వడానికి.

ఎన్నిమాట్లుచెప్పనురా నీకూ మీనాన్నకీ? శుక్రవారంపూటా ఎవరికి ఏమీ ఇవ్వకూడదు దేముడా అంటే నామాట వినిపించుకోరుగదా!

ఏమిటే, ఆ గడబిడ, గొంతుక చించుకుంటున్నావేమిటి? అంటూ లోపలికి వచ్చాడు రఘునాథరావు.

ఏమిటా! ఎన్నిసార్లుచెప్పాను మీకు!

అబ్బా! అసలుసంగతియేమిటో చెప్పుబాబూ!

నారాయుడుకి కూలివ్వడానికి వీల్లేదు. ఇవ్వాళ శుక్రవారం.

శుక్రవారమో, గిక్రవారమో. వాడిపెళ్లానికి జబ్బుగా వుందట కాస్త ఇవ్వనియ్యి ఇవ్వాళకి.

సరేలేండి నేర్చుకు పోయారు. తెలియకపోతే వూరుకోండి; నాకంఠంలో వూపిరివుండగా ఇల్లాంటి పనులు చెయ్యనియ్యను.

అమ్మగోరూ రచ్చించండి.

ఛా! వెధవా! అవతలకుపో బుద్ధిలేదురా నీకు! అంటూ వెంకమ్మగారు తిట్లవర్షం కురిపించటం మొదలుపెట్టింది.

ఆవర్షానికి తట్టుకోలేక కళ్లనీళ్లు కారుస్తూ వెళ్లిపోయాడు నారాయుడు.

♦ ♦ ♦

ఏమండోయ్, 'బ్రహ్మరథం' బాగున్నదని అందరూ చెబుతున్నారు. పదిరూపాయిలు ఇల్లాపడెయ్యండి. వెళ్లివస్తాం.

# శుక్రవారం

ఇవ్వాళ శుక్రవారం కాదటే మరి

ఏం మాటలండిమీవి, సినిమాకి వెళ్లటానికి శుక్రవారం యేమిటి?

♦ ♦ ♦

చీకటిపడింది. కళ్లవెంటనీరు, కారుస్తూ నారాయుడు యింటికి వెడుతున్నాడు. వాడిమనస్సు అంతా అంధకారమయంగావుంది. బయటా చీకటి, లోపలా చీకటి. యింటికి వెళ్లగానే పిల్లలు 'అయ్యా' 'అయ్యా' అంటూ పరుగెత్తుకు వస్తారు. ఆకలిఅంటూ యేడుస్తారు. ఆ అస్థిపంజరాల్ని ఓదార్చేమార్గం యేమిటి? నారాయుడిభార్య నాల్గురోజుల్నుంచి జ్వరంతో బాధపడుతోంది. పిలిస్తే పలకదు, మాట్లాడదు. మందిప్పిద్దామంటే చేతులో పైసాలేదు. చూడటానికే అయిదురూపాయి లడుగుతాడా డాక్టరు. ఏం చేయ్యాలో వాడికేమీ తోచడంలేదు. విచారసముద్రంలో మునిగి వుక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు పాపం.

'అయ్యా, ఇయ్యాలేం కూడులేదుపో అని కొత్తింది, అక్క' అంటూమూడేళ్లది-రాముడు కాళ్లకి చుట్టేసుకుంది.

నారాయుడు ఉలిక్కిపడ్డాడు, అప్పుడే యింటికివచ్చానే అనుకున్నాడు.

'మరేం, పొద్దుణ్ణించి ఒక్క మెతుకుకూడా తినలేదు. కడుపులో మండిపోతూంది' అంటూ ఇద్దరుపిల్లలూ పరుగెత్తుకువచ్చారు. పెద్దపిల్ల గుంటలుపడినకళ్లతో, ఎండిపోయిన మొహంతో, నరములేకాని చీము నెత్తురు లేని శరీరంతో దూరంగానుంచుని తండ్రివైపు దీనంగాచూడటం మొదలుపెట్టింది.

మధ్య మధ్య రోగి పిచ్చికేకలు. నారాయుడు దగ్గరకువెళ్లి చూచాడు. కాళ్లు, చేతులు చల్లగా వున్నాయి. వాడికి మతిపోయింది. గబగబా డాక్టరుగారింటికి పరుగెత్తుకు వెళ్లాడు.

♦ ♦ ♦

'బాబూ, దణ్ణాలండి, చాలాజబ్బుగావుంది. రచ్చించండిబాబూ' 'ఇప్పుడు వాడవలసినమందు చాలా వెలగలది. అయిదురూపాయలయినా పట్టుకురా. తప్పకుండా వస్తాను.'

'అయ్యాపేదోడనండి, యిల్లునిలబెట్టండి, మీ పేరు చెప్పుకుంటా.' చేతులుజోడించాడు, కాళ్లమీద పడ్డాడు. కాని ఆకఠినహృదయుని మనస్సు కరగలా. అసలు దాన్నిమనస్సు అనటం కన్న పాషాణమే అనటం మంచిదేమో.

యజమానియింటికి వెడితే ఏమన్నాయిస్తాడేమో అన్నఆశతో పరుగెత్తడం మొదలుపెట్టాడు.

చీకటి బాగాయెక్కువగావుంది. అక్కడక్కడ మిణుగురు పురుగులు మాత్రం మిణుకు మిణుకు మంటున్నాయి. వాడిమనస్సులోని ఆశలాగానే, ఆఅంధకార మాయప్రపంచంలో, ఆమేఘాలరాజ్యంలో, పొలాలగట్ల వెంట గాలికంటె యెక్కువవేగంగా పరుగెత్తుతున్నాడు. పడుతూ లేస్తూ యజమానియింటికి జేరుకున్నాడు. 'యెవ్వడావాడు?' వెంకమ్మ కర్కశస్వరం వినిపించింది. నేనమ్మా, నారాయుణ్ణి, రచ్చించండి, అంటూ కాళ్లమీదపడ్డాడు.

ఒరే కిష్టిగా, వీణ్ణవతలకు యీడ్చెయ్యరా.

రెండుయినపచేతులు నారాయుణ్ణి బయటకుతోసి గేటువేశాయి.

(o)